క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పుల్లలచెరువు: గిరిజనచెంచు గూడేలైన గార పెంట, చెన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో పద్మావతి బుధవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లోని రికార్డుల తనిఖీతో పాటు పిల్లలకు ప్రీస్కూల్ యాక్టివిటీస్ సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో రాయించడం, చదివించడం చేయించారు. రక్తహీనత తగ్గించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తల్లులకు వివరించారు. పిల్లల ఎత్తులు, బరువులు తప్పని సరిగా తీసుకోవాలని, పిల్లలు బరువు తక్కువగా ఉంటే బరువు పెరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తూ ప్రభుత్వం అందజేస్తున్న వివిధ రాయితీలను అర్హులకు తప్పని సరిగా అందజేయాలన్నారు. కేంద్రాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీడీపీవో వెంట సూపర్‌వైజర్ శివలక్ష్మి ఉన్నారు.

భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు


మట్టి పరీక్షను పరిశీలిస్తున్న ఏడీఏ

తాళ్లూరు: భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని దర్శి ఏడీఏ నిర్మలకుమారి అన్నారు. తాళ్లూరులో బుధవారం వీఏఏలు, రైతులకు మట్టి పరీక్షపై శిక్షణ ఇచ్చారు. నిర్మలకుమారి మాట్లాడుతూ భూసార పరీక్షలతో నత్రజని, భాస్వరం, పోటాష్, సూక్ష్మ పోషకాలు ఎరువుల మోతాదును తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏఈఓలు నాగరాజు, రాజ సుందరి, ప్రకృతి ఇన్‌చార్జి నరసింహులు పాల్గొన్నారు.

పొదిలి బార్ అసోసియేషన్ ఎన్నిక

పొదిలి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంవీ రమణ కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ హాల్లో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శిగా షేక్ షబ్బీర్, ఉపాధ్యక్షుడిగా మాతంగి రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా గాలిముట్టి పెద్దయ్య, మహిళా ప్రతినిధిగా గాదె సుజాత, కోశాధికారిగా టి.రామమోహనరావు, లైబ్రేరియన్‌గా పీవీఎస్ రాఘవరావు, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా ముల్లా నాయబ్‌రసూల్, నూతన బార్ సభ్యులుగా సీహెచ్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు ఉడుముల లక్ష్మీరెడ్డి, శ్రీపతి శ్రీనివాసరావు పాల్గొనగా, ఎన్నికల అధికారిగా జి.సుబ్బారావు వ్యవహరించారు.

పంట నమోదు పత్రాల పంపిణీ

కంభం: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కందులాపురం-1 రైతు భరోసా కేంద్రంలో బుధవారం జరిగిన పంట నమోదు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేసిన పంటలకు క్రమం తప్పకుండా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకొని పంట నమోదు పత్రాలు పొంది ప్రభుత్వం అందించే సబ్సిడీ ఫలాలు, రాయితీలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నివృత్తి చేస్తుండాలన్నారు. అనంతరం కంభం-1 రైతు భరోసా కేంద్రం పరిధిలో మట్టి నమూనా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి వీఏఏలకు అవగాహన కల్పించారు. మార్కాపురం ఏడీఏ రమాదేవి, డీఆర్‌సీ ఏఓ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

కంభం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కంభం-3 సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పర్యటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతుండంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని జేసీఎస్ మండల కన్వీనర్ డిష్ మున్నా అన్నారు. సచివాలయం పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందించి స్టిక్కర్లు అంటించారు. ఎంపీటీసీ రఫీ, మధు, రషీద్ పాల్గొన్నారు.

రాచర్ల: పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని గృహసారథుల మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి అన్నారు. మండలంలోని గుడిమెట్ట, జి.కొత్తపల్లి, అనుమలవీడు, పాలకవీడు, ఒబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్.. అనే కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ పంచాయతీల్లో సచివాలయాను ఏర్పాటు చేసి అనేక ప్రభుత్వరంగ సేవలు అందిస్తున్నారని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి నేరుగా ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. పాలకవీడు సర్పంచ్ పల్నాటి లతీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు సూర పాండురంగారెడ్డి, పిచ్చిరెడ్డి, కామిరెడ్డి నారాయణరెడ్డి, గృహసారథులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మా నమ్మకం జగనన్నే


ఈతముక్కలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి


చదలవాడలో కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- నినదిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు, ప్రజలు
- ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు

ఒంగోలు రూరల్: మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, ప్రజలు ముక్త కంఠంతో నినదిస్తున్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. ఒంగోలు మండలంలోని కరవది గ్రామంలో ఒంగోలు మాజీ వైస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు, బీసీ సెల్ సభ్యులు కోటు శేషు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కైలా శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు. ప్రజల అనుమతితో వారి ఇళ్ల గోడలకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. సర్వే నిర్వహించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కలలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి, కె.పల్లెపాలెంలో సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, పార్టీ నాయుకులు బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ పాలనకు, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడా వివరించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండటానికే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రకాల పథకాలను అర్హత కలిగిన వారికి పైసా అవినీతి లేకుండా కుల, మత, పార్టీలు చూడకుండా నేరుగా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు మాట్లాడుతూ మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఏడాదికి రూ.4 వేలు, డీజిల్ సబ్సిడీగా లీటర్‌కు రూ.9, వేటకు వెళ్లి మరణిస్తే రూ.10 లక్షల ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం అమలుచేస్తోందని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనపై పలు ప్రశ్నలడిగి తెలుసుకున్నారు. ప్రజలతో టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి జగనన్న సైన్యం...

నాగులుప్పలపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో విశ్వాసం, నమ్మకం మరింత పెరిగిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా బుధవారం చదలవాడ గ్రామ సచివాలయం పరిధిలో ఇంటింటికి తిరిగారు. జగనన్న పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి పాలనపై అభిప్రాయాలు తీసుకుని జగనన్నే మా నమ్మకం అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రజలతో కాల్ చేయించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు గుడూరి రాంబాబు, గ్రామ సర్పంచ్ దాసరి వరప్రసాదరావు, రామస్వామి, వలంటీర్లు పాల్గొన్నారు.


ముప్వావారిపాలెంలో స్టిక్కర్లు అందిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు


కరవదిలో మహిళలకు పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌బాబు

వైఎస్సార్ సీపీకి అండగా నిలవండి...

చీమకుర్తి (మద్దిపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు కోరారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముప్వావారిపాలెం గ్రామంలో బుధవారం ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కుంచాల రాంబాబు, బొడ్డు కోటేశ్వరరావు, సీహెచ్ మస్తాన్‌రెడ్డి, కాకర్ల వెంకట్రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కుటుంబ సభ్యులు

అభిమాన నాయకుడికి అపూర్వ స్వాగతం

- హెలీప్యాడ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసిన నేతలు

తర్లుపాడు: వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత ప్రారంభోత్సవానికి బుధవారం మార్కాపురం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇక్కడి జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో పాటు నాయకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా హనుమారెడ్డి, డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర, గొలమారి సత్యనారాయణరెడ్డి, చెప్పల్లి కనకదుర్గ, ఎం.శ్రీనివాసులు, కొత్త కృష్ణ, దొడ్డా భాగ్యలక్ష్మి, డి.హర్షిత, దేవకరుణమ్మ, టి.రంగ లక్ష్మమ్మ, సలీమ్, ప్రసాద్, చంద్రశేఖర్, కె.నగేష్, షేక్షావలి, రోజ్ లీడియా, చెన్నారెడ్డి, వనజాక్షి, లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ పెనుగొండ కేశవరావు, డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషగిరిరావు, పత్తి వెంగన్న, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, కార్పొరేషన్ల డైరెక్టర్లు మేడా బద్రి, నల్లబోతుల కొండయ్య, సవ్వాన్ని వెంకమ్మ, బుశెట్టి నాగేశ్వరరావు, ఎం.పుష్పలత, కరీంబాషా, మయూరి ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు మండలానికి చెందిన ఎంపీపీ దంపతులు భూలక్ష్మీరామసుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు మురారి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పెద్ద మస్తాన్, పోతలపాడు సర్పంచ్ గాయం శ్రీనివాసరెడ్డి, నాయకులు భవనం చెన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. పొదిలి మండలం నుంచి కన్వీనర్ డి.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి చెన్నారెడ్డి, పార్టీ నాయకులు సంజీవరెడ్డి, రమణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సాయి రాజేశ్వరరావు, నరసింహరావు, కల్లం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొనకనమిట్ల మండలం నుంచి ఎంపీపీ మురళి, జెడ్పీటీసీ సభ్యుడు ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ శంకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కె.వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ రామానారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ..


మాజీ ఎమ్మెల్యే ఉడుముల..

పేస్‌లో సిబ్బందికి వైద్య పరీక్షలు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అపోలో డయాగ్నోస్టిక్స్, హార్లిక్స్ ఉమెన్స్ ప్లస్ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. విటమిన్ డీ, బీ 12, ఐరన్, కాల్షియం, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు నిర్వహించిన అపోలో బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఏవో రమణబాబు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సర్వేరెడ్డిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో కూడిన వైద్యం అందించడం లక్ష్యంగా పనిచేస్తోందని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని యరజర్ల గ్రామంలో 104 వాహనం ద్వారా బుధవారం వైద్య సేవలు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఎన్‌ఎంలతో కూడిన మెడికల్ బృందం వారి వద్ద నమోదైన సమాచారాన్ని బట్టి దీర్ఘకాలిక, స్వల్పకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిక వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమాచారం మేరకు గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు అత్యవసర పరిస్థితుల్లో ఉపశమనానికి తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్సకు మెడికల్ ఆఫీసర్ నంబర్‌కు కాల్ చేసి సమాచారం పొందవచ్చని తెలిపారు.


సర్వేరెడ్డిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాంమోహన్‌రావు, సచివాలయ ఏఎన్‌ఎంలు, స్థానిక ఏఎన్‌ఎం, హెల్త్ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు. మండల మెడికల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు హెచ్‌వీలు అజిత, శ్రీనివాసులు, చేజర్ల, పాతపాడులో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. చేజర్లలో గ్రామ సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి శ్రీలత, శైలజ పాల్గొన్నారు.

మోదీని గద్దె దింపండి

ఒంగోలు టౌన్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని, దేశాన్ని కాపాడాలని సీపీఐ, సీపీఎంలు సంయుక్తంగా చేపట్టిన దేశ వ్యాప్త ప్రచార భేరిని విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి కోరారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను స్థానిక మల్లయ్య లింగం భవనంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెబుతున్న మోదీకి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందని సీపీఎం నాయకుడు దామా శ్రీనివాసులు విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ముడి సరుకు కేటాయించడం చేతకాని కేంద్ర ప్రభుత్వానికి ఫ్యాక్టరీని అమ్మే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్‌డీ సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు, కల్లూరి లక్ష్మయ్య, పాటిబండ్ల సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ చిడితోటి జీవన్

- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ చిడితోటి జీవన్

ఒంగోలు: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ క్రీడల్లో పాల్గొనాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ చిడితోటి జీవన్ పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో టెన్నిస్‌బాల్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జైభీమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జైభీమ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని క్రీడాపోటీలు నిర్వహణకు ముందుకు వచ్చిన యువతను అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత చాందిని ప్రియ, శ్రీను, పోటీల నిర్వాహకులు చవల సురేష్, చిక్కాల కిరణ్‌కుమార్, ఆర్.గురుభరత్, పసుమర్తిగోపి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన పరిమిత ఓవర్ల టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో జంగా భాస్కర్ ఎలెవన్ - టంగుటూరు మధ్య జరిగిన పోటీలో జంగా భాస్కర్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో కరేడు జట్టుపై మంగమూరు శివ జట్టు విజయం సాధించింది. నిర్వాహకులు చిక్కాల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం ముగింపు ఉత్సవం ఉంటుందని, ఈనెల 14న స్థానిక మినీ స్టేడియం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు భారీ బైక్ ర్యాలీని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

15న పొగాకు ముక్క కొనుగోలు


మాట్లాడుతున్న వేలం అధికారి రామకృష్ణ

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం-2లో ఈ నెల 15న పొగాకు ముక్క, బిడ్స్ బేళ్ల కొనుగోళ్లు జరుగుతాయని వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ముక్క, బిడ్స్ బేళ్లు కట్టే సమయంలో ఇచ్చిన పట్టను వాడాలని, అలాగే బోర్డు వారి నిబంధనల ప్రకారం 150 కిలోలకు మించకుండా బేళ్లు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ అమ్మకం రెగ్యులర్ అయ్యాక వాటాలో కలవదని, ఇది పూర్తిగా అదనపు కోటాగా పరిగణించబడుతుందని చెప్పారు. రైతుల వద్ద ఉన్న పొగాకు ముక్కను పూర్తిగా అమ్ముకోవచ్చని తెలిపారు. అలాగే గ్రౌండింగ్, కండిషనింగ్ విషయాలలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. పొగాకు ముక్క, బేళ్ల వివరాలను తమ ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలిపి నమోదు చేయించుకోవాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

806 పొగాకు బేళ్ల కొనుగోలు...

ఒంగోలు వేలం కేంద్రం-2లో బుధవారం వేలానికి 855 బేళ్లు రాగా, 806 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 9 బేళ్లు నోబిడ్ అయ్యాయి. కేజీ గరిష్ఠ ధర రూ.200, కనిష్ఠ ధర రూ.167, సరాసరి ధర రూ.191.38గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

మంచినీటి కొరత తీర్చాలి

ఒంగోలు టౌన్: వేసవి నేపథ్యంలో మంచినీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం డిమాండ్ చేసింది. మంచినీటి పథకం ద్వారా ఇళ్లకు మంచినీరు సరఫరా కాని కుటుంబాలు జిల్లాలో 4,98,290 ఉన్నాయని, ట్యాంకర్ల ద్వారా మాత్రమే మంచినీటిని వినియోగించుకునే పరిస్థితితో 261 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 119 గ్రామాలకు 200 ట్యాంకర్ల ద్వారా 1,188 ట్రిప్పుల నీరు సరఫరా చేస్తున్నారని, 2,658 చేతిపంపులు, 232 డీప్ బోర్‌వెల్స్ నిరుపయోగంగా పడి ఉన్నాయని తెలిపారు. పశ్చిమ ప్రాంతంలో 12 మండలాల్లో మంచినీటి కొరత తీవ్రంగా ఉందని, సాగర్ కాలువ ద్వారా 137 చెరువులకు నీరు పెట్టే ప్రక్రియ సంపూర్తిగా జరగలేదని వివరించారు. ప్రజలు సొంత ఖర్చులతో మంచినీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉందని, వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన శ్రద్ధతో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, నాయకులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, షేక్ మహబూబ్, ఎం.రమేష్, ఉసా వెంకటేశ్వర్లు, డి.సోమయ్య, వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో నూతన పొగాకు వేలం కేంద్రం ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న మారెడ్డి సుబ్బారెడ్డి, సత్య శ్రీనివాస్, తదితరులు


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మారెడ్డి సుబ్బారెడ్డి

మద్దిపాడు: పొగాకు రైతులు బేళ్లను మంచి ధరలకు అమ్ముకోవాలని పొగాకు భారత పొగాకు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, బొడ్డపాటి బ్రహ్మయ్య, పాద వరప్రసాదరావు అన్నారు. మండలంలోని వెల్లంపల్లి వేలం కేంద్రంలో రూ.7.5 కోట్లతో నిర్మించిన నూతన వేలం కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం పాల్గొని వారు ప్రసంగించారు. ఈ సంవత్సరం పంటలో 70 శాతం మేలిమి రకం పొగాకు పండిందని, 30 శాతం లోగ్రేడు పండిందన్నారు. కర్నాటకలో ఈ సంవత్సరం పొగాకు పెద్దగా పండక పోవడంతో అక్కడ అదనంగా పండిన పొగాకును ఎటువంటి నష్ట పరిహారం లేకుండా కొనుగోలు చేశారని చెప్పారు. 100 మిలియన్ కేజీల పంటకు పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా కేవలం 60 మిలియన్ల పొగాకు మాత్రమే పండించగలిగారని దీంతో బోర్డు వారు పెనాల్టీలు లేకుండా అదనంగా పండించిన రైతుల వద్ద పొగాకును కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కూడా పంటకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో పెనాల్టీలు లేకుండా లైసెన్స్‌డ్ రైతుల వద్ద పొగాకు బోర్డు కొనుగోలు చేయాలన్నారు. పొగాకు బోర్డులో ఫీల్డ్ స్టాఫ్, ఇతర కార్యాలయ సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, వెంటనే వారిని నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద వేలం కేంద్రంగా వెల్లంపల్లి వేలం కేంద్రం ఉందని అన్నారు. ఈ వేలం కేంద్రంలో సుమారుగా 2 వేల బేళ్లు వేలం నిర్వహించవచ్చని, రూ.5 లక్షల వ్యయంతో గోడౌన్‌లు మరమ్మతులు చేయించామని వేలం నిర్వహణాధికారి సత్య శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్, ఎంఎం ప్రవీణ్, బోర్డు నాయకులు అబ్బూరి శేషగిరి, మహేష్ రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోవిందరాజులు, గంగిరెడ్డి సుబ్బారెడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.